ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

నండూరి యెంకి పాటలు - కవితాతత్వ పరిశీలన

డాక్టర్ పప్పల వెంకటరమణ

ఎం ఏ., పి హెచ్. డి., (గోల్డ్ మెడల్),తెలుగు విభాగాధిపతి,ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు),శ్రీకాకుళం.,చరవాణి: 9491811710.

వ్యాస సంగ్రహం:

గురజాడ నడచిన జాడలో, బసవరాజు త్రొక్కిన త్రోవలో మునుముందుకు పయనించి, జానపదుల బాసనూ, యాసనూ గీతాలుగా అల్లిన భావకవి శ్రీ నండూరి వెంకటసుబ్బారావు. కవిత్వం సమాజం నుంచి విడదీయరాని ఒక బంధం అనే రహస్యాన్ని ఎరిగి, పల్లీజనమనఃప్రవృత్తికి ఒక రూపకల్పన చేసిన శిల్పి నండూరి వెంకట సుబ్బారావు. నండూరి యెంకిపాటల్లోని కావ్యత్వమును సమగ్ర పరిశోధన ద్వారా జానపదుల గుండెల్లో నిలిచిపోయేటట్లు, ఆనాటి జానపదుల ప్రణయం, యాస, భాషలను, సంస్కృతీ సంప్రదాయాలను, కలుషితంలేని హృదయాలను ఈనాటి పాఠకులకు విడమర్చి చెప్పడమే వ్యాస రచయిత ముఖ్య ఉద్దేశం.

కీలక పదాలు:లాక్షణికులు, మాండాలికాలు, బంధుత్వము, గోనెపట్టా, రంభానలకూబరులు, భావకవిత్వం, సాహిత్యము, అలంకారము, ఆకాశవాణి, చైత్ర యాత్ర.

ఉపోద్ఘాతం:

నండూరి వెంకటసుబ్బారావుగారిని కన్న ఊరు వసంతవాడ. అప్పటి కృష్ణాజిల్లాలోని ఏలూరు తాలూకాలో 1895 డిసెంబర్లో జన్మించారు. "కంఠంలో కిన్నరున్నాడే" అన్నారు జాతకం వ్రాసినవారు. 'అమావాస్యనాడు పుట్టాను జారుణ్ణో, చోరుణ్ణో అవుతానురా' అని తర్వాత సరదాగా అంటుండేవారు నండూరి వారు. ఈ రెండు నిజమే. కంఠంలో ఒదిగిన ఆ కిన్నరుడే యెంకిపాటల రూపంలో తెలుగు నేలను గాంధర్వంలో ముంచెత్తాడు. అమావాస్యనాడు పుట్టిన ఫలితమేమో రసిక హృదయ రసికాజారుడైనాడు. అసంఖ్యాక పాఠకచోరుడైనాడు. ఆరోఏట సంగీతం నేర్చుకున్నాడు. స్వరజ్ఞానం అలవడింది. రాగపరిచయం ఏర్పడింది. అది భవిష్యత్తులో యెంకిపాటల రాగసృష్టికి ప్రాతిపదికగా మిగిలింది.

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

సుకుమారమైన భావాన్ని సరసమైన ధోరణిలో అందించడమూ, పూర్వం ఉన్న నియమ నిబంధనలను త్రోసిరాజని రసిక లోకానికి కొత్త వంటకాలను రుచి చూపించడమూ ఈ పాటల్లో ప్రధాన లక్ష్యాలు. సద్యఃపరనిర్వృతిని కలిగించడమే వీటి ముఖ్య ప్రయోజనం.

ప్రధాన విషయం:

కవిత్వం హృదయ ధర్మం. ఒక పద్యం పుట్టాలన్నా, ఒక పాట గజ్జె కట్టాలన్నా మధనం తప్పదు, మననం తప్పదు. కృతి ప్రారంభంలో కలిగే అవస్థను స్థూలంగా కృత్యాద్యవస్థ అంటే, గీతి ప్రారంభంలో ఏర్పడే అవస్థను సూక్ష్మంగా గీతాద్యవస్థ అనుకోవచ్చు. ఈ అవస్థలో ఒక కిశోరమూర్తి 1817 - 18లో మద్రాసు మహానగరంలో కదిలే ట్రాంబండి, ఆ బండి రోదలో ప్రయాణికుల సందడిలో ఆ తరుణహృదయంలో ఒక లయ పుడుతున్నది. ఆ అక్షరాలు తోడుక్కోవాలని గొంతుదాకా వచ్చి గోలపెడుతున్నది. అదో ప్రసవ వేదనలా ఉంది. గుండెకు గొంతుకకూ మధ్య ఆసుపోసినట్లు తిరిగిన ఆ భావవీచిలో, ఆ రాగరోచిలో అవతరించింది ఒక పాట పాపగా. అయితే ఆ పాపలో పసితనం లేదు. బాల్యం లేదు. అది పుట్టింది సద్యోయౌవనంగా.

"గుండె గొంతుకలో కొట్లాడుతాది

కూకుండ నీదురా కూసింతసేపు"[1]

ఇది ఆ పాటకు పల్లవి. ట్రాంబండిలో గుండెగొంతుకుల సంరంభాలను అనుభవించిన ఆ కిశోరమ్మూర్తి నండూరి వెంకటసుబ్బారావు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో పట్టభద్రుల పరీక్షకు చదువుకుంటున్న యువజిజ్ఞాసువు.

యెంకి:

యెంకిపాటల్లోని ఈ మొదటిపాట జననం ట్రాంబండిలో జరిగినా నామకరణం ఆ తర్వాతే జరిగింది. ఈ తొలిపాటలో యెంకిపేరు కనిపించదు. యెంకి ప్రవృత్తిలో పదునైన అభిరుచులు కనిపిస్తాయి. ఆశపెట్టడం, విసిరికొట్టడం, ఉలిపించడం, అంతలోనే జడిపించడం.

నండూరి వారు ముందుగా ఈ పాత్రను ఊహించుకోలేదు. మధనం ఫలితంగా వెలువడిన ఆ మొదటిపాటలో ఒక శృంగార నాయిక అలవోకగా తలయెత్తింది. ఆ నాయికకే ముచ్చటగా పేరు పెట్టుకున్నారు 'ముద్దుల నా యెంకి' అని. యెంకిని కావ్యనాయికగా తీర్చిదిద్దుకున్న క్షణంలోనే ఒక శృంగార నాయకుడు రూపుదిద్దుకున్నాడు 'నాయుడుబావ'గా.

పూర్వరంగం:

చిన్నప్పటి నుంచి పాటలంటే చెవి కోసుకునేవారు నండూరివారు. ఎన్నో పాటలు నోరారా పాడుకునేవారు. పదేపదే పడుకునే పాటలలో.....

"ఒంటిచేద్దణమ్మూ భామా

ఒప్పదు నా మనసూ

రెండు చేతూ లెత్తి భామలు

దన్నం పెట్టండి".

ఇలాంటి పాటలు ఎన్నో బాల్యంలో వారు సేకరించి పాడుకునేవారు. ఏకసంథాగ్రహి కావడం వల్ల వాటిని చిరకాలం మననం చేసుకునేవారు. కళాశాలలో చేరకముందే జానపదగీతాల వరసలను ఆకళించుకున్నారు. 'చల్ మోహనరంగా' పాటలు, 'వెంకయ్య - చంద్రమ్మ' పాటలు, 'నారాయణమ్మ' పాటలు వారి హృదయంలో చిగురులు తొక్కుకుంటూ ఉన్నాయి. గురజాడ వారి 'ముత్యాలసరాలు' వారి గళపేటికలో మిలమల మెరుస్తూ ఉన్నాయి. బసవరాజు అప్పారావు గీతాలు ఆ రసాత్మను కొనవేళ్ళతో స్పృశిస్తూ ఉన్నాయి. ఇన్ని ప్రభావాలు ప్రోద్బలంగా సహజ సంస్కారం ప్రేరకంగా వెలువడిన తొలిగీతం 'ముద్దుల నా యెంకి'. ఈ ప్రభావములతో పాటు ఆంగ్ల విద్యా ప్రభావం కూడా నండూరి వారి ఆలోచనల పైన సముచిత ముద్ర వేసింది. ఆంగ్ల కాల్పనిక కవులలో ముఖ్యంగా రాబర్ట్ బర్న్స్ జానపద భాషలో వ్రాసిన గీతాల ప్రభావం ఆత్మీయంగా పనిచేసింది.

బర్న్స్ - నండూరి:

బర్న్స్ సజీవమైన స్కాటిస్ మాండలిక భాషలో పాటలు వ్రాశాడు. నండూరి గోదావరీ మండలికంలోనూ, విశాఖప్రాంతంలోని తూర్పుయాసలోనూ పాటలు రచించాడు.

Went అనడానికి gaed అనడం

None అనడానికి nane అనడం

So అనడానికి sae అనడం — స్కాట్లాండ్ మాండలికల్లో కనిపిస్తుంది. ఇలాంటి ప్రయోగాలు బర్న్స్ గీతాల్లో కోకొల్లలు. యెంకి పాటల్లో నా వైపు లాకాసి అనడానికి 'నాకాసి', పోయింది అనడానికి 'పోనాది', పడుకున్నావా అనడానికి 'పండుకున్నావా' ఇలాంటి ప్రయోగాలే. నండూరి 'వెంకయ్య- చంద్రమ్మ', 'నారాయణమ్మ - నాయుడుబావ', చల్ మోహనరంగా పాటల్లోని అశ్లీల ఛాయలను పరిహరించి వాటిలోని పలుకుబడిని, జిలుగునుడిని స్వీకరించాడు. నండూరివారి యెంకి పాటలను క్రమంగా పరిశీలిస్తే ఒక ఉదాత్త ప్రణయకావ్యం కనిపించను. మాత్రాఛందస్సులను మలచుకోవడంలో నండూరి అందివేసిన చేయి. బర్న్స్ ప్రత్యేకత Glorified Simplicity. అంటే సామాన్య విషయాన్ని సముదాత్తంగా వర్ణించడం. యెంకిపాటల్లో ఉన్న జీవగుణమూ ఇదే. మరింత ఆంతరంగికంగా పరిశీలిస్తే బర్న్స్ గీతాలతో సంవదించే యెంకిపాటలు కొన్ని స్ఫురిస్తాయి. మచ్చుకు కొన్ని—

"నమలిమింగిన నాయెంకి" అనే పాట, బర్న్స్ వ్రాసిన Bonnie Lesley (బానీలేస్లీ) అనే ఒక అందమైన పిల్ల రూపగుణచిత్రణ.

"For nature made her what she is
And never made sie another"[2]

అనే పంక్తుల ప్రభావము

"యెంకివంటిపిల్ల లేదోయి లేదోయి"

అనే పల్లవిలో ధ్వనిస్తుంది. 'నీ వొక రాణివి, మేము నీ బానిసలం' అన్న భావన "రానోరింటికైన రంగుదెచ్చే పిల్ల" అనే పంక్తిలో దరహాసిస్తున్నది.

"Thou art divine" అన్న బర్న్స్ ఆరాధన

"యెంకొక్క దేవతై యెలసెనంటారు" లో పునర్దర్శనమిస్తున్నది.

బర్న్స్ కు నండూరికి ఉన్న ఆత్మబంధుత్వంలో Local Colouring కూడా చెప్పుకోదగింది. స్కాట్లాండ్ జానపద వాతావరణాన్ని బర్న్స్ చిత్రించగా, తెలుగునాటి పల్లీపరిసరాలను, పైరుపచ్చలను, వాగువంకలను నండూరి వారు పాటలఅద్దాలలో పదిలంగా చూపెట్టారు. వరిసేలు, పండుయెన్నెల, యేటిగట్టు, ఏతాం, గోనెపట్టా, గొంగడి, మామిడితోట, జొన్నసేలు, దుబ్బుదుట్రా, గొడ్డుగోదా, ఈకాడ నోకొండ ఆకాడ నోకొండ మొదలగునవి.

యెంకిపాటలు - కావ్యత్వం:

యెంకిపాటల తొలి ముద్రణ 1925 లో వెలువడింది. ఆ సంపుటిలో 35 పాటలు ఉన్నాయి. మలిముద్రణ 1953లో వెలువడింది. 43 కొత్త పాటలతో పాటు, అచ్చయిన ఈ పాటలు భావానుక్రమంగా ఉన్నవి కావు. అయితే పాతకొత్త పాటలలో యెంకి మనస్తత్వక్రమపరిణామం స్పష్టంగా గోచరిస్తుంది. పాత పాటలలో యెంకి పల్లెటూరి గబ్బిలం. కొత్త పాటలలో యెంకి బస్తీకోయిల. అప్పుడు అమాయకత్వం. ఇప్పుడు గడుసుతనం. ఆనాడు అనురాగం. ఈనాడు రాగతనం. అయినా రాగగతంగా హృదయంలో ఉన్న యెంకితనం ఆమె అక్షులగవాక్షాల నుంచి తొంగిచూస్తూనే ఉంటుంది. ముఖ్యంగా తొలిముద్రణలోని పాటలు పత్రికల్లో నుంచి సేకరించి యదేచ్ఛగా ప్రచురించినవే. ఇప్పుడున్న పాటలక్రమాన్ని బట్టి పరిశీలిస్తే యెంకి పాటల్లోని భావ పరిణామంగానీ, రసయానంగానీ అవగతం కావు. ఏపాటకాపాట ఒక మెరుపులా మెరుస్తుంది. ఒక తరగలా ఉరుకుతుంది. కానీ కాలాతీతకాంతి ప్రసరణం, నిరంతరజీవవాహినిత్వం గోచరించదు. నండూరి కారయిత్రీ, ప్రతిభ, పల్లవ, కోరక, ప్రసూన, ఫలదశలను అనుభవించిన క్రమ పరిణితిని గమనించాలంటే ఈ పాటల క్రమాన్ని చూడవలసి ఉంటుంది. యెంకిపాటల్లో అంగిరసమైన శృంగారం విభిన్న ప్రస్థానాలను అధిగమించిన వైఖరిని పరిశీలించాలంటే ఈ పాటల వెనుక ఒక కావ్యత్వాన్ని, ఒక అన్యోన్యతత్వాన్ని అన్వేషించవలసి ఉంటుంది. ఆ దృష్టితో ఈ పాటలను పునః పరిశీలించగా వీటిలో స్ఫురించిన దశలు ఈ విధంగా ఉండును.

1. పూర్వరాగం:- లాక్షణికులు ప్రేమ తొలుత నాయికలోనే ఉదయించాలని చెబుతారు. యెంకిపాటలు లక్షణశాస్త్రాన్ని ముందు ఉంచుకుని వ్రాసినవి కాకున్నా, వీటిల్లోనూ నాయికే ముందుగా నాయకున్ని ప్రేమిస్తుంది. మొట్టమొదటి పాటలో ఈ మొత్తం కనిపిస్తున్నది.

"సూస్తాది నవ్వు నవ్విస్తాది."

ఆ చూపులో చక్షురాగం అనే మదనావస్థ ఉన్నది. 'వొనలచ్చిమి' అనే గీతములో 'జామురాతిరియేళ' చేనిలో ఉండగా మెల్లిగా వస్తుంది. అయితే కేవలం నాయికాపరంగా ఉన్నాయని అనుకోరాదు.

"ముందో మాకోయెట్టి మరిగించినాది,

పల్లకుందామంటె పాణమాగదురా"[3]

వంటి పంక్తుల్లో నాయికపట్ల నాయకుని కున్న వివశత్వం, ప్రాణదఘ్న ప్రణయశీలం ద్యోతకమవుతున్నాయి. ఈ మరిగించడం ఉత్తమ నాయకాలక్షణమా? అని కనుబొమ్మలెక్కుపెట్టిన వాళ్లు లేకపోలేదు. ఇది వాచ్యార్థంలో గ్రహించవలసిన పట్టుకాదు. 'మందోమాకోయెట్టి' మరిగిస్తే కలిగే ఉన్మాదస్థితి నాయకునిలో కలిగిన తీవ్రాతితీవ్రమైన ప్రణయభావాతిరేకాన్ని సూచిస్తుంది. మనస్సంగావస్తకే మారురూపమిది. ఈ ప్రధమరాగదశలో నాయికానాయకులు నిరంతర పరస్పరవీక్షణం, నిత్యసాన్నిహిత్యం కోరుకుంటారు. ఎన్నెన్నో ముచ్చట్లు ఒలకబోసుకుంటారు. యెంకిపాటల్లో ఈ ప్రథమరాగం పాతపాటల్లో కనిపిస్తుంది. 'సరుకు లేమి కావాలి' అని నాయుడు అడిగితే 'మరమమిడిసి" అని యెంకి బదులిస్తుంది.

"యేడనే నీ కాపురమో యెల్తురుపిల్లా" అని అడిగితే

"నీ నీడలోనే మేడకడతా నాయుడుబావా"

అంటూ ముగ్ధత్వాన్ని ప్రదర్శిస్తుంది.

అప్పటికి వారికి పెళ్లికాలేదు. ఒకరినొకరు చూసుకోకుండా, కలుసుకోకుండా ఉండలేరు. అందుకే జామురాతిరి కలుసుకోవడం. నాయుడు ఏతామెత్తుతూ ఉంటే ఎదురుగా కూర్చుని కాలాన్ని మరిచిపోతుంది యెంకి. కాలాన్ని వీరు మరిచినా కాలం వీరిని మరుస్తుందా? మళ్లీ ఎప్పటి వలె తెల్లారబోతుంటే....

"సెందురున్నీ తిట్టు నా యెంకి

సూరియున్ని తిట్టు నా యెంకి".

ఈ దూషణం ప్రలాపం అనే మధనావస్థకిందికి వస్తుంది. కానీ ఇది మన్మధతప్తలైన ప్రబంధనాయికల చంద్రాద్యుపాలంభనం వంటిది కాదు. ఇంతలోనే రేయి కరిగిపోతుందే అన్న నాయక ఆందోళనను సూచిస్తుంది. యెంకి ఈ దశలో కన్యగానే ఉంది. నలుగురు చూస్తూ ఉండగా కలుసుకోలేదు. అందుకే రాత్రిని ఆశ్రయించడం, కోడిగూసేసరికి అని ప్రాధేయపడటంలో యెంకి కన్యత్వము స్పష్టంగా గోచరిస్తుంది. ఈ పూర్వ రాగదశ వీక్షణభాషణములతోనే గడిచిపోయింది. కన్ను గిలికించినా, బులిపించినా అంగస్పర్శ లేని అనంగరాగ మది. 'దగ్గర కూకుంటే అగ్గిసూస్తాది' అనడంలో అప్పటికి నాయికాశీలం అనలంలా అచుంబితమని తెలుస్తుంది.

2. దాంపత్యయోగం:

"ఆవుల్ని దూడల్ని అత్తోరి కాడుంచి,

మూటా ముల్లీ గట్టి, ముసిలోళ్లతో సెప్పి,

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

యెంకీ, నాతోటి రాయే......."

అనే చరణంలో యెంకి నాయుడుబావలకు పెళ్లయిపోయినట్లు స్పష్టమవుతున్నది. అప్పటికే యెంకి నాయుడుబావ గుండెను నమిలి మింగినట్లు, కళ్ళుఎత్తితే కనకాభిషేకాలు చేసే గృహలక్ష్మి. పెళ్లి తర్వాత యెంకినాయుడు బావల దాంపత్యజీవనం ధర్మనిష్ఠితం అయిపోయింది.

"మనిసే సాలు, మనిషి మాటే సాలు"

అన్న పరిపూర్ణ తృప్తి యెంకిపట్ల నాయుడు బావ కేర్పడింది. ఇద్దరూ కలిసి తిరుపతి ఏడుకొండలెక్కారు. భద్రాద్రికి వెళ్లారు. కాశీని దర్శించారు. 'సంకలో సంబ్రాలు పడు' కుర్రవాణ్ణి కన్నారు. క్రమంగా యెంకి "**ఇయంగేహే లక్ష్మీ రియమ మృతవర్తిర్నయనయోః**"[4] అన్న భవభూతి అనుభూతిస్థాయిని అందుకున్నారు.

"యెంకొక్క దేవతై యెలిసె నంటారు.
యింటింట పెడతారు యెంకి నీ పేరు!
సాటేలా? నీకు మాటేలా?"

ధర్మపత్నిలో దివ్యత్వాన్ని దర్శించాడు నాయకుడు. ఈ ప్రణయం మంజిష్ఠారాగం. పైకి బాగా కనిపించడం, కలకాలం నిలిచిపోవడం దీని లక్షణం. సీతారాముల అనురాగం నీలిరాగం. పైకి స్ఫుటంగా కనిపించకుండా ఉండడం, శాశ్వతంగా కొనసాగడం దాని లక్షణం. వీరి దాంపత్యయోగం 'గోవు మాలచ్చిమి' అన్న పాటలో అన్ని అంచులతో భావిస్తున్నది. గోవు ధర్మానికి ప్రతీక. యెంకినాయుడుబావల ధర్మశృంగారానికి గోవు ప్రకటించిన ఆమోదం ఈ పాటలోని వస్తువు.

3. విప్రయోగం:

యెంకి కేవలం ముగ్ధ కాదు. ఆమె శీలానికి రెండు పదునైన అంచులు ఉన్నాయి. ఒక్కమాటు ఆమె వికసిస్తుంది విరిలా. ఒక్కొక్కమాటు గుప్పుమంటుంది ఆవిరిలా. ఇదే 'యెంకితనం'. 'సూపుతో మాట్లాడు' 'ఊపిరితో తెనిగించు' అనే పంక్తుల్లోని కుశాగ్రధిషణ ఈ యెంకితనానికి మూలధాతువు. అందుకే నాయుడుబావ అంటాడు యెంకితో కాపురం చేయడం 'కత్తి మీదె సాము కొత్తి మీదే కూడు' అని. అంతటి తాదాత్మ్యస్థితిలో వారి గార్హస్థ్యజీవనం సాగిపోతూ వుంది. మన 'యెంకేయని, కానీ నసువులకు పోరాదు' అని గమనిస్తూనే వచ్చాడు నాయకుడు. ఎంతటి పరస్పర అవగాహన ఉన్నా ఇద్దరూ ప్రత్యేక వ్యక్తిత్వాలు ఉన్నవారు కాబట్టి అభిప్రాయభేదాలు తప్పలేదు. పర్యవసానం పొల అలుకలు, చిరుకలహాలు. అలుకతో యెంకి పుట్టింటికి వెళ్ళిపోయేది. కొన్నాళ్లదాకా ఎవరు పట్టింపులు వారివే. ఎవరిచోట వారే. ఇది విప్రయోగదశ. నాయకుడు పలవరించేవాడు "యాడుంటివే యెంకి యాడుంటివే" అని. ఆమె తళుకు జ్ఞాపకం వస్తే అతని తల తిరిగిపోయేది. మామిడిపండు తింటే విషమైపోయేది. విరహ తీవ్రత భరించలేక నాయకునికి కినుక కలిగేది.

"రావద్దే నా పక్క రావద్దె యెంకీ

ఆ పొద్దే మన పొత్తులయిపోయె యెంకీ"

అంటూ ఆకాశ భాషణం చేసేవాడు. తోటలోనికి వెళ్లినా అదే కలత.

"తోట పూసంటే సికాకూ, యెంకి
తోటి యెల్లే దాని సోకూ"

అంటూ నిట్టూర్పులెగజిమ్మేవాడు. ఒక్కొక్కమాటు యెంకి మీద కోపంతో నాయుడుబావ ఎక్కడికో వెళ్లిపోయేవాడు.

"నన్నిడిసిపెట్టెల్లినాడే నారాజు
మొన్నే తిరిగొస్తానన్నాడే"

అంటూ ఆక్రందించేది యెంకి దురంతనిరీక్షణలో.

"ఆనాటి నావోడు సెందురూడా
అలిగి రాలేదోయి సెందురూడా"

అని తమ సంయోగ దశలో సాక్షిభూతుడుగా ఉన్న చందురునితో మొరపెట్టుకునేది.

"ఈ రేయి నన్నొల్ల నేరవా? రాజా
ఎన్నెలల సొగసంత యేటిపాలేనటర"

అంటూ ఏటి గట్టున నిలిచి నాటి స్మృతుల తలపులు తెరచి, విప్రలబ్ధగా విపస్పాలించేది. చివరికి ఎంతకూ తన బావ తిరిగిరాకపోయేసరికి

"దూరాన నా రాజు కేరాయిడౌనో!
ఈరోజు నారాత లేరాలపాలో"

అని కీడు శంకించేది కూడా.

4. <u>పూర్ణయోగం:</u>

ఉత్తముల కోపం క్షణకాలం. ఉదాత్త సంస్కారాన్ని పండించుకున్న దంపతుల పొరపొచ్చాలు కూడా స్వల్పకాలికాలే. తాత్కాలికమైన ఉద్రేకానికి లోనైనా, నాయుడు బావ ఎక్కడికో వెళ్లినా, ఇద్దరి మధ్య తప్పిదాలు కప్పినా, వారి అంతరంగాలలో స్థిరంగా చిరంగా ఉన్న ఆహ్లాదంగానే ఉండేది. మళ్లీ కలుసుకున్నప్పుడు పెల్లుబికే 'రవలపెలుగులగంగ'లా. ఆ అనురాగధారలో స్నాతులై పునీతులై యెంకి నాయుడుబావలు నిర్వికారస్థాయి నందుకున్నారు. ఈ సమున్నతికి, ఈ పూర్ణ యోగస్థితికి 'యెనకజన్మములోన యెవరమోనంటే' అనే పాట పతాకసదృశం. ఈ పాటలో త్రికాలాల్లోనూ యెంకినాయుడు బావల అవిభాజ్యయోగం ధ్వనిస్తున్నది. 'ఆరిపేయవె దీపమూ' అనే పాటలో నాయకుని ఇంద్రియాతీత సౌందర్య దృక్పథం అన్నింటిని నధిగమించినది.

" ఎంకెవ్వ' రని లోకమెపుడైన కదిపితే

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

వెలుగునీడలవైప వేలు సూపింతు!"

వంటి పంక్తుల్లో ప్రాకృతికధర్మం పారమార్థిక స్థాయినందుకున్నది.

'పగలు రేయి లెడబాటెరుగఎవ్వరోయీ'

'శంకరుడుసతియచట,యింకెవ్వరిచట'

వంటి పంక్తులు యెంకి నాయుడుబావల దాంపత్య జీవనం సాధించిన అద్వైతసిద్ధికి ప్రతిబింబాలుగా నిలిచిపోయినవి.

5. యెంకి అందం:

యెంకి చాలా అందగత్తె. ఆమె సౌందర్యంలో ఏమాత్రం కృత్రిమత్వం లేదు. 'నీలిచీరగట్టి నీటుగొస్తా వుంటే', 'ఒయ్యార' మొలికిస్తుంటే, 'వొనలచ్చిమి'లా ఉంటుంది ఆమె. 'మెళ్ళో పూసలపేరు, తల్లో పూవులసేరు' ధరించి ఆమె' కళ్లెత్తితే కనకాభిషేకాలు' అవుతాయి. 'సెక్కిట సిన్నీ మచ్చ'తో ఆమె ఒక్క నవ్వు నవ్వితే 'వొజ్జరవోయిడూరాలు' కురుస్తాయి. అందుకే 'రాసోరింటికైనా రంగుతెచ్చే పిల్ల'గా భావించబడింది యెంకి.

అంతేకాదు యెంకి అందం చీకట్లోనూ దీపంలా కాంతిల్లుతుంది. అందుకే 'ఆరిపేయవే దీపమూ – యెలుగులో నీమీద – నిలపలేనే మనసు' అంటాడు నాయుడు బావ.

యెంకి స్వీయయో, పరాకీయయో నిజముగా కవి హృదయమునకెరుక. ఆ పరమాత్మునకెరుక. **"యెంకి ఒకప్పుడు అభిసారికయు, ఒకప్పుడు స్వాధీనయు, ఒకప్పుడు విముఖియు, ఒకప్పుడు చపలయు, ఒకప్పుడు రూపపూరితయు పరుషయునగు"**[5] యెంకి కవికుమారుని భావనా ప్రపంచమున ప్రణయాధారమగు నొకటే వ్యక్తి.

6. యెంకి గడుసుతనం:

యెంకి అందం తరవాత చెప్పుకోతగింది ఆమె గడుసుతనం. 'సూపుతో మాటాడి, వూపిరితో తెనిగించు' తుంది. 'కనుబొమ్మతో నవ్వి మనసు కరిగించు'తుంది ఆమె. 'పూల బాసలూ - మనసులూ' ఆమెకు తెలుసు. ఆమెకు 'పూలతో వియ్యాలూ - పూలతో కయ్యాలూ తెలుసు.

7. యెంకి ధైర్యం:

భర్త గ్రామాంతరం వెళితే దొర ఇంటిలో నాయుడుబావలా నటించగల ధీర యెంకి. 'మబ్బు సెందురుడల్లే - మనిసిలో మనసల్లే' ఆమె 'నీలలో మునిగి వెలుగుతో తేలుతుంది'. దేవుడు ఎదుట గర్వంగా నిలబడుతుంది.

8. యెంకి సరదాలు:

యెంకి నాయుడుబావకు ఉండే సరదాలను కూడా ఎంతో సహజసిద్ధంగా కులసతీప్రణయానికి తగిన విధంగా పేర్కొన్నాడు కవి. యెంకి కోసం ఎదురుతెన్నులు చూసి దిగులుతో తలదించుకొని ఒక్కసారిగా తిరిగి చూచేసరికి ఆమె రావాలి. పొరుగూరు వెళ్లి ఇంకా రాలేదని అనుకునేసరికి 'ఘల్లుఘల్లు' మంటూ కాలుపెట్టి 'యెల్లివొచ్చా' నని ఆమె నవ్వాలి. ఇరుగు పొరుగు అమ్మలక్కలతో అతడు 'వొరస' లాడుతుంటే, 'పొలమెల్లి పొద్దుపోయి వచ్చేయాళ' ఎంకి చూపులో వచ్చే మార్పు గమనించాలి.

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

9. భావచిత్రాలు:

ఎంకిపాటలనిండా ముఖ్యంగా పాత పాటల్లో అంతటా పరుచుకుని ఉన్నవి మాండలిక పదాలూ; తప్పితే భావ చిత్రాలు. కనిపించే దృశ్యాలను మాటల్లో బొమ్మగీసి చూపడం ఒక ప్రతిభ. కనిపించని రూపాలను పదాలతో పట్టివ్వడం అసాధారణ ప్రతిభ. అలాంటి ప్రతిభతో దిద్దిన భావచిత్రాలు కొన్నిటిని పరిశీలిద్దాం.

(1) "కస్సుమంటా యేరు గాలి సెగబోసింది"[6]

ఏటిలో జోరుగాసాగే పడవవిసురుతో గాలి హోరున వీచే గాలిని తూర్పారబట్టినట్లుగా ఉన్నది. అగుపించినట్లు దించిన భావచిత్రమిది.

(2) "గాలికైనాతాను కవుగిలినన్నాడు"[7]

నాయకుని ఉత్తమశీలాన్ని పరమవ్యంగ్యంగా రూపొందించిన ప్రకటన మిది.

(3) "పూలెరుగు నాకోత నీలెరుగు నామోత"[8]

నాయక హృదయం సుకుమారమైనది. నీటివలె సుతిమెత్తనిది. ఆమె గుండెకోత ఆ పూలకే తెలుసు. ఆమె ఎదలోని కల్లోలం ఆ నీటికే తెలుసు.

(4) "ఏటి కడుపున దాగి తోట నిదరోయింది"[9]

ఒక నిశ్చలఛాయాచిత్రాన్ని అత్యంత సహజంగా తీసిన పదచిత్రమిది.

(5) "**ఆకాశ మావరస ఆవులించిన రేయి**

ఎలుతు రంతా మేసి ఏరు నెమరేసింది"[10]

వంటి భావచిత్రాలు విశ్వకవితాభాండాగారంలో అగ్ర పంక్తిలో నిలువదగిన నిధులు.

యెంకిపాటల్లోని భావచిత్రాలన్నీ దాదాపుగా నండూరివారి మౌళిక ప్రతిభలో నుండి ఉద్భవించినవే. 'ఉయ్యాల' అనే గీతంలో మాత్రం ఒక చరణం పైన సంప్రదాయ సంస్కారముద్ర స్పష్టంగా భాసిస్తున్నది. ఏటి ప్రక్కన ఉన్న చెట్టుకొమ్మకు ఉయ్యాల కట్టుకొని యెంకి ఊగుతున్నది. ఏటినీటిలో ప్రతిఫలించిన చంద్రవంక బొమ్మఉయ్యాల నూగుతున్నది. ఈ దృశ్యాన్ని చిత్రీకరిస్తున్నాడు కవి.

"తీగల నడుమ నూగె
దీపమై తిలకించు
పీఠమై - ఎంకికి-కీ
రీటమై నెలవంక".

భాగవతంలోని 'రవిబింబం బుపమింప' అనేటట్లు తోస్తున్నది. వామనుని త్రివిక్రమత్వాన్ని సూచించడానికి సూర్యబింబాన్ని కొలమానంగా తీసుకున్నాడు పోతన్న. మొదట ఛత్రంలా వామనుని శిరస్సుపై నిలిచిన ఇనబింబం క్రమంగా శిరోరత్నంగా, శ్రవణాలంకారంగా, కేయూరంగా, కంకణంగా పర్యవసించి, చివరికి పదపీఠిగా నిలిచిపోతుంది.

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

ఈ 'ఉయ్యాల' పాటలో కొమ్మఉయ్యాల ఊగుతున్న యెంకికి నెలవంక దీపంలా, నుదుటి తిలకంలా, పీఠంలా, చివరికి తలపై కిరీటంలా పరిఢవిల్లింది. ప్రాచీన కావ్యాభ్యాస సంస్కార ఫలితంగా నండూరివారి గొంతు నుండి పునరవతరించిన భావనారమ్యచిత్రమిది.

10. యెంకిపాటలు - మాండలిక పదాలు:

ముత్యాలసరాల ద్వారా గురజాడ అప్పారావుగారు శిష్టవ్యవహారిక భాషను కావ్యోపయోగిగా తీర్చిదిద్దడం ఆనాటి గొప్ప ప్రయోగం. ఆ తర్వాత బసవరాజు అప్పారావు గారు ఆ దారిలో నడిచిన వారిలో అగ్రగణ్యులు. శిష్టవ్యవహారికంతో ఆగిపోక ఇంకొక్క అడుగు ముందేసి మాండలికభాషలో సముదాత్తభావాలను సమర్థంగా అందించిన ప్రయోగశీలి నండూరి సుబ్బారావుగారు. మామూలుగా పాటకజనం మాట్లాడుకునే మాటల్లో ఎంత పాటవం ఉందో రుజువుచేశారు. వారు యెంకిపాటల్లో ఉన్న మాండలికపదాలు ప్రాయకంగా గోదావరి, విశాఖ మండలాలకు సంబంధించినవే. మచ్చుకు కొన్ని......

(1). కూనంతసేపు : కాసంతసేపు, కాసేపు అనడానికి వాడుకలో ఉన్న తూర్పుయాస ఇది.

(2). ఉసురోసుకుంది : ప్రాణం తీసేసింది అనే అర్థంలో వాడే మాట ఇది. తెలంగాణలో ఉసురుపోసుకుంది అనే ప్రయోగం ఉంది.

(3). అగ్గిసూస్తాది : కసిరిచూస్తుంది అనే అర్థంలో – ఇది విశాఖప్రాంతం వాడుక.

(4). దగ్గరన : గోదావరి వాడుక. దగ్గరగా అనే అర్థంలో ఈ పదాన్ని వాడుదురు.

(5). పల్లకుందామంటే : ఊరుకుందామంటే అనే అర్థంలో వాడే పదము.

(6). కొంగట్టుకు : కొంగుపట్టుకొని. గోదావరి విశాఖ మండలాల వాడుక. ఇందులోని పవర్ణలోపం తెలంగాణలోనూ అక్కడక్కడా ఉంది. మూడోద్దులు - మూడురోజులనడానికి. పొద్దులులోని పవర్ణం లోపించి ఏర్పడిన పదబంధ మిది.

(7). పద్దాక: చాలాసేపు. తెలంగాణలో ఇది పొద్దనుక అనే రూపంలో ఉంది.

(8). తలతిరిగిందోలె : ఇందులోని ఓలే అంటే ఓసి. 'రావే ఓలే' ఇది తూర్పు ప్రయోగం.

ఇంకా బేగి (వేగంగా) బుటకలు (మునకలు), ఆపడితే (అగపడితే), కొత్తి (పొయ్యి) లాంటి మాండలిక పదాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వీటిని ప్రయోగించడం విశేషం కాదు. ఆ ప్రయోగం రససిద్ధికి దోహదం చేయడం, ఏమాత్రం చతికిలబడకుండా కండగల శిష్టపదజాలంతో దీటుగా అంగలు సాచి నడవడం.

11. కొత్త పాటలు - గొంతు మార్పు:

1925 లో పాతపాటల ప్రచురణ జరిగింది. 1926 లో నండూరివారు ఏలూరులో న్యాయవాద వృత్తిలో చేరారు. 'ప్లీడరీకి కవిత్వానికి సగమెరుక సుమీ' అని మిత్రులు హెచ్చరించారు. పాటల నడక ఆగిపోలేదు కానీ కాస్త

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

మందగించింది. 1948లో నండూరి వారికి ప్రముఖ వైణికగాయకులు మంచాళ జగన్నాధ రావుగారి స్నేహం లభించింది. మంచాళవారు వీణపై క్షేత్రయ్య పదాలను పాడి వినిపిస్తుంటే పరవశించి వినేవారు నండూరివారు. వారిలో సుప్తంగా ఉన్న సృజనశక్తి పొరలెత్తి మేలుకుంది. గళగ్రంధి విడిపోయి మళ్ళీ పుంస్కోకిల కూజితాల జల్లులు కురిపించడం మొదలయింది. జగన్నాధరావుగారు ధన్యాసి రాగంలో "చల్లనాయెలేరా నామనసెంతో" అని క్షేత్రయ్యపదం వినిపించగా ఆ రాగప్రభావంతో 'దీపమంజరి' వెలువడింది. ఇలాగే కొత్తపాటల్లోని చాలా పాటలు జగన్నాధరావు గారి వీణాగానంతో ఉద్భుద్ధమైనవే. క్రమంగా నండూరి వారిపై విలంబకాలసంగీత ప్రభావం సాంద్రంగా పడింది. దానితో స్వరం పాట తీరుమారింది. పాటలోని 'యెంకి' కొత్తరూపం ఎత్తింది. 'యెలుగు' వెలుగు అయింది. 'సెట్టు' చెట్టుగా మారింది. చంద్రుడు 'సెందురుడు' 'రేరేడుగా' రూపొందినాయి. పోను పోను-----

"సాగరుని సల్లాపమా అల
చందురుని యుల్లాసమా సిక
తాతలాల విలాసమా
ఆ పగిడి బంధించు నీ కనుపాప నెయ్యది తాపసీ?"

వంటి భావకవితాప్రౌఢపదముద్రలున్న గీతం మిశ్రగతిలో వెలువడింది.

యెంకిపాటల్లో ఉన్న మాత్రాఛందోగతులు నూటికి తొంబై యైదు పాళ్లు ఖండగతిలో నడిచినవే. అయితే జానపదం నుంచి జ్ఞానపథంలోకి జరిగిన ఈ పయనంలో ఇదే క్రమమని ఖచ్చితంగా గీటుగీసి చెప్పలేము. కొత్తపాటల్లో స్థూలంగా శైలి, బాణీ మారినా 'ఈ రేయి నన్నొల్ల నేరవా', 'లేపకే నా యెంకి లేపకే నిదర', 'ఇంతేనటే సంద్ర మేంతేనొ అనుకొంటి" వంటి జానపద పరిమళమున్న పాటలూ లేకపోలేదు. ద్విపద వంటి ఛందస్సును కూడా ఎన్నో తీరుల కులుకుల ఒలికించవచ్చనీ, మాత్రాఛందస్సులో కూడా జానపద సాహిత్య ధోరణిలో ఒక ప్రణయ కావ్యాన్ని రచించవచ్చనీ నిరూపించారు నండూరి.

"ముక్కుతిమ్మన పదమార్థవం, కీట్సు సౌందర్యాన్వేషణ, క్షేత్రయ్య ఆధ్యాత్మిక శృంగారం"[11] ఈ పాటల్లో ఉన్నాయని చలంగారు భావించారు. రాజశేఖరుడి సంస్కృత కావ్యమీమాంస తెలుగులోకి తెచ్చిన సాహిత్యవేత్త పంచాగ్నులవారు మెచ్చిన యెంకిపాటలు 'అనర్ఘవాగ్మయం' కాజాలవు

12. యెంకిపాటల ప్రశస్తి:

సుమారు నాలుగు దశాబ్దాలుగా నండూరి సుబ్బారావుగారు ఏది పలికినా యెంకిమాటగా, ఏది పాడినా యెంకిపాటగా జీవించారు. తమ రాగజీవనాన్నీ, కవితా ప్రవృత్తినీ యెంకితో తాదాత్మ్యం చేసుకున్నారు. ఇంటింటా యెంకి పేరు పెట్టుకుంటారని తమ కృతిసాఫల్యాన్ని భావించుకున్నారు. "వుత్తమాటలు నీవి పొమ్మ"ని యెంకి కొత్తపాటలు పాడుకోమన్నా – ఆ కొత్తపాటల్లోనూ యెంకే సాక్షాత్కరించింది. కాశీవిశ్వేశ్వరుడు కూడా తల తడుముకొని తబ్బిబ్బుపడేటట్లుగా రసాకృతియై తేజోమూర్తియై నిలబడింది యెంకి. అందుకే నండూరి వారే అన్నారు.

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

"యీ చిత్తముకు వెలుగు నీ యెంకితనమే" అని.

యెంకిపాటలుకాక నండూరి వారు వ్రాసిన ఏకైక గీతం "తల్లీ మా కస్తూరిబా". 1923లో గాంధీగారు కాకినాడకు వచ్చినప్పుడు వ్రాసిన పాట ఇది. ఇప్పుడు లభించడం లేదని వారి కుమారుడు బాలసూర్యరావుగారు ప్రకటించారు. నండూరివారి అభిమానగీతాలు 'వుత్తమాటలు నీవి', 'నన్నిడిచిపెట్టెల్లినాడే' అని చెప్పిరి.

తొలినాళ్ళలో యెంకిపాటలపైన రేగిన గాలిదుమారం ఇంతా అంతా కాదు. ప్రతి ప్రయోగశీలికి పట్టిన అవస్థే ఈ పాటలకూ పట్టింది. చేవ ఉన్న ప్రతి నవ్య ప్రయోగము చివరికి జైత్రయాత్ర సాగించినట్లే యెంకిపాటలు కూడా తెలుగునాట శైశిరావస్థదాటి చైత్రయాత్రలు సాగించాయి. ఆ రోజుల్లోనే ప్రముఖ విద్వాంసులు ఈ పాటలను ప్రశంసించారు.

"యెంకినాయుడుబావలు కేవలం జీవేశ్వరులే" [12] అని అన్నారు పురాణం సూరిశాస్త్రి గారు.

"శృంగార రసాధిష్ఠాన దేవతలగు రతీమన్మధులే వీరని" అన్నారు పంచాఙ్ఞుల ఆదినారాయణశాస్త్రి గారు.

"రంభానలకూబరులు అలంకారశాస్త్ర విరుద్ధంగా శృంగార సల్లాపం చేసిన దోషం వలన కలియుగంలో యెంకీనాయుడు బావలుగా జన్మించారని" చమత్కరించారు వేదం వెంకటరాయశాస్త్రి గారు.

"యెంకి నాయుడు బావలు సంకర దంపతులనియు, వారి శృంగార మసభ్యకరమనియు, అవినీతికరమనియు, నండూరి వారు అనర్ధవాంగ్మయాన్ని సృష్టించాడని"[13] తమ నిరసనమును వ్యక్తీకరించారు వొక్కులూరి లక్ష్మీనారాయణగారు.

"పండితు లెవరో కాదనుట విని గుణము లేనిదే వారు కాదనరే? యని యెంచి ఈ కవికుమారుని ఇచ్చటికి ఆహ్వానించితిని" అని రెడ్డి మహాసభలకు నండూరి వారిని ఆహ్వానించి సత్కరించారు కట్టమంచి రామలింగారెడ్డి గారు.

'యెంకి' నాపే రితని కేమి లేదట వీని
నెవ రెరుగ రంటా
నామకానామకుల నటనె నేడంట
ప్రకృతి సుందరిజంటపరులకెటులంట"14

అనే పాటను లక్ష్యంగా ఉదాహరించారు వేదాల తిరువేంగళాచార్యులుగారు ఆంధ్ర ధ్వన్యాలోకంలో.

"యెంకిపాట వన్స్ మోర్" అన్నాడు శ్రీ శ్రీ.

ఇంకా గిడుగు, వేటూరి, మల్లంపల్లి, కోలవెన్ను, బూర్గుల వంటివారు ఈ పాటలను వ్యాసరూపకంగా ప్రశంసించారు.

ఆకాశవాణి ద్వారా, సాహిత్యసభలద్వారా, లలితసంగీత కార్యక్రమాలద్వారా ఈ పాటలు బహుళ ప్రచారం పొందినవి.

ముగింపు:

యెంకిపాటల రూపంలో ఒక సరికొత్త గేయసంప్రదాయాన్ని, యెంకి ద్వారా వినూత్న శృంగార నాయికను తెలుగు కావ్యజగతికి అందించిన నండూరి సుబ్బారావుగారు తరువాత తరాలకు అనుకరణీయులైనారు. అందరికీ అందుబాటులోనే ఉన్నా ఎవ్వరికీ అందకుండానే ఉన్నారు.

నండూరి తాను వాడిన భాషలో ఎంతో సాహసాన్ని ప్రదర్శించి ఎర్రబావుటా ఎగరవేశారు. ఇదే తర్వాత మాండలికయాసలో రచించే కవులకు మార్గదర్శకం అయింది. వాస్తవానికి ఈ పాటలపై లేచినంత గాలిదుమారం మరో దానిపై లేవలేదు. ఒక విధంగా ఆ విమర్శలే సాహిత్య లోకంలో యెంకిపాటలకు ప్రాచుర్యాన్ని కలిగించాయి. యెంకి పుట్టుకే తెలుగుదనానికి ఒక కొత్త వోకడ కొనివచ్చింది. అప్పటినుంచి కావ్య జగత్తులో పల్లీజన ప్రకృతికి ప్రముఖంగా స్థానం లభించింది. సరస శృంగారానికి ఒక ఆదరణ ఏర్పడింది.

ఈ పాటలను ఆధారం చేసుకుని బుచ్చిబాబు, జరుక్ శాస్త్రి, రజని ఎన్నో నాటికలు రచించారు. అడవి బాపిరాజు వర్ణ చిత్రాలు చిత్రీకరించారు. ద్వారంవారు సంగీత లోకంలోకి ఎక్కించి వేళ్ళలో పలికించారు. విస్సావారు గేయజగత్తులో స్థానం కల్పించారు. విమర్శకులు ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా యెంకి నాయుడుబావలను ఊహించారు.

కాబట్టి 'యెంకిపాటలు' తెలుగు భారతీగళసీమను అలంకరించిన మణుల పేటలు - తేనె తెలుగుమాటల మూటలు.

పాద సూచికలు:

1. నండూరి వెంకట సుబ్బారావు, ముద్దుల నాయెంకి - యెంకి పాటలు, పుట- 2.
2. సింగిరెడ్డి నారాయణరెడ్డి, సమీక్షణం, (వ్యాస సంపుటి), పుట - 39.
3. నండూరి వెంకట సుబ్బారావు, ముద్దుల నాయెంకి - యెంకి పాటలు, పుట- 2.
4. సింగిరెడ్డి నారాయణరెడ్డి, సమీక్షణం, (వ్యాస సంపుటి), పుట - 42.
5. బూర్గుల రామకృష్ణారావు, సారస్వత వ్యాస ముక్తావళి, పుట - 10.
6. నండూరి వెంకట సుబ్బారావు, పడవ - యెంకి పాటలు, పుట - 37.
7. నండూరి వెంకట సుబ్బారావు, ఆనాటి నావోడు - యెంకి పాటలు, పుట - 42.
8. నండూరి వెంకట సుబ్బారావు, రాగతనం - యెంకి పాటలు, పుట - 52.
9. నండూరి వెంకట సుబ్బారావు, రాగతనం - యెంకి పాటలు, పుట - 52.
10. నండూరి వెంకట సుబ్బారావు, కలతనిదర - యెంకి పాటలు, పుట - 54.
11. డాక్టర్ శివలెంక ప్రకాశరావు, భావకవుల ప్రతిభావిస్ఫూర్తి, పుట - 282.
12. పురాణం సూరి శాస్త్రి, సమీక్షణం(వ్యాస సంపుటి), పుట - 50.
13. వొక్కులూరి లక్ష్మీనారాయణ, భారతి సెప్టెంబర్, 1924, పుట - 76.

ISSN:3048-5908 Impact Factor: 3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, (April), 2024

14. వేదాల తిరువెంగళాచార్యులు ఆంధ్ర ధ్వన్యాలోకం(చతుర్థ ఆశ్వాసం), పుట - 65.

ఆధార గ్రంథములు:

1. వెంకట సుబ్బారావు నండూరి (1925), యెంకిపాటలు, జెమిని ప్రింటర్స్, పవరుపేట, ఏలూరు.
2. డాక్టర్ ప్రకాశరావు శివలెంక(1987), భావకవులు - ప్రతిభావిస్ఫూర్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. డాక్టర్ రామకృష్ణారావు బూర్గుల (1990), సారస్వత వ్యాసముక్తావళి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
4. డాక్టర్ నారాయణరెడ్డి. సి (1981), సమీక్షణం (వ్యాస సంకలనం), వంశీ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్.
5. నాగయ్య. జి (1985), తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం), నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
6. ప్రొఫెసర్ సిమ్మన్న వెలమల (2011), తెలుగు సాహిత్య చరిత్ర, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం.
7. డాక్టర్ ద్వా. నా. శాస్త్రి (1998), తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
8. మహతి (సమీక్ష వ్యాస సంకలనం) (1972), యువభారతి ప్రచురణలు, సికింద్రాబాద్.
9. ఆరుద్ర (2004), సమగ్ర ఆంధ్ర సాహిత్యం (నాలుగవ సంపుటం), తెలుగు అకాడమీ, హైదరాబాద్.
10. ఆచార్య శ్రీరామమూర్తి కొర్లపాటి (1995), తెలుగు సాహిత్య చరిత్ర, రమణశ్రీ ప్రచురణలు, విశాఖపట్నం.